ప్రజాశక్తి

బుధవారం 19 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మేయర్ పీఠంపై కూటమి కన్ను

▶ వార్త 2లో..

ఢామిట్.. కథ అడ్డం తిరిగిందా ?

రుషికొండపై గంటా 'సోలో పెర్ఫార్మెన్స్'పై చంద్రబాబు కస్సుబుస్సు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రుషికొండపై అత్యుత్సాహం ప్రదర్శించి ఈ నెల 16న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొంతమంది టిడిపి నేతలను, మీడియాను వెంటబెట్టుకుని చేసిన హంగామాపై టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కస్సుబుస్సుమన్నట్లు భోగట్టా. గత జగన్ ప్రభుత్వంలో విశాఖలో నిర్మితమైన 7 సూపర్ స్ట్రక్చర్స్ (భవన సముదాయాలు)కు పర్యావరణ అనుమతుల్లేవని, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) ఉల్లంఘనలు జరిగాయని ఆరోపణలున్న విషయం తెలిసిందే. తాజాగా మరో వివాదం రుషికొండను అలముకుంది. అయితే ఆ వివాదానికి కర్త, కర్మ, క్రియా అంతా గంటాయేనని తెలుస్తోంది. ఆయన 'సోలో పెర్ఫార్మెన్స్' బయట అదిరినా పార్టీలోపల చర్చనీయాంశంగా మారింది.

రుషికొండ భవనాల వద్ద కూటమి శ్రేణులతో గంటా శ్రీనివాసరావు (ఫైల్‌ఫొటో)

అసలేం జరిగింది ?

జగన్ నుంచి అధికారం చేతులు మారిన తర్వాత.. కూటమి పార్టీల అధినేతల సమక్షంలో రుషికొండలో పర్యటించాలన్న ప్రణాళిక మూడు పార్టీలకూ ఉందన్నది తెలిసిందే. నిర్మాణం జరుగుతున్నప్పుడే టిడిపి, జనసేనలు కోర్టులనాశ్రయించాయి. ఆ తరువాత చాలా పరిణామాలే చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతలోనే టిడిపి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్థానిక ఎమ్మెల్యే హోదాలో రుషికొండపైకి జనాలతో వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా రుషికొండ నిర్మాణాల భాగోతాన్ని బయటపెట్టిన నాయకునిగా హైలెట్ కావడం చంద్రబాబుకు నచ్చలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పత్రికల్లో రెండు రోజుల పాటు పతాక శీర్షికన రుషికొండ కథనాలే రావడంతో అధినేతలు పొందాల్సిన ప్రచారం అంతా గంటాకే దక్కడం కూడా అధినేత కస్సుబుస్సులాడడానికి మరో కారణంగా ఉందని కూటమి పార్టీ నేతల్లో తాజాగా చర్చనీయాంశమైంది. పార్టీ అధినేతలు వెళ్లాక జరగాల్సిన, కూటమికి చెందాల్సిన క్రెడిట్ అంతా గంటా ఒక్కరే వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం పొందారన్న గుసగుసలు సొంత పార్టీలోనూ మిగతా 2లో..

1438 మంది రైతులకు అందని పిఎం కిసాన్ సాయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఇకెవైసి చేసుకోలేని రైతులకు పిఎం కిసాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదు. మంగళవారం 17వ విడత కింద ఈ ఏడాది ఏప్రిల్-జులైకు సంబంధించి తొలి నాలుగు నెలల కిసాన్ నిధులను ప్రధాని మోడీ బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలో జమచేశారు. జిల్లాలో ఈ పథకం కింద 1,88,614 మంది రైతులకు రూ.37.72 కోట్లు వారి ఖాతాలో జమ కానున్నాయి. అయితే పెట్టుబడి సాయం కింద రైతుకు ఇచ్చే నిధుల్లో ఇకెవైసి కాలేదన్న పేరుతో నిధులు ఇవ్వకుండా కోత పెడుతుండటంతో పలువురు లబ్ధిని కోల్పోయారు. అటువంటి వారు జిల్లాలోని 24 మండలాల్లో 1438 మంది ఉన్నారు. వారికి పిఎం కిసాన్ సాయం కింద ఇచ్చే రెండు వేల రూపాయలు అందని పరిస్థితి ఏర్పడింది. పిఎం కిసాన్ సాయం కోసం ఇకెవైసిని కేంద్రం తప్పనిసరి చేయడంతో అర్హత కలిగిన రైతులు కిసాన్ సాయానికి దూరమవుతున్నారు.

వేతనాలు చెల్లించాలని ఉక్కు కార్మికుల ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

కెజిహెచ్ నర్సింగ్ స్కూల్‌లో డెంగీ

▶ వార్త 2లో..

అప్పలరాజు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, తదితరులు

కార్మిక నేత అప్పలరాజుకు అశ్రు నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనారోగ్యంతో సోమవారం కన్నుమూసిన విశాఖ జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి అప్పలరాజు అంత్యక్రియలు మంగళవారం అశ్రు నయనాల నడుమ సాగాయి. తొలుత అప్పలరాజు పార్థివ దేహం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శులు బి.జగన్, పి.మణి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ధామిట్.. కథ అడ్డం తిరిగిందా ?

వినిపిస్తున్నాయి.

తాళాలు ఎవరిచ్చారని బాబు ఆరా !

'అసలు తాళాలు ఎవరిచ్చారు ? ఎందుకంత మందిని పోగేసుకుని మాకు తెలియకుండా వెళ్లావు' అంటూ గంటా వ్యవహారంపై బాబు కస్సుబుస్సుమన్నట్లు టిడిపి శ్రేణుల్లో తాజాగా చర్చనీయాంశమైంది. చాలాసేపు ఫోన్‌లో మాట్లాడి గంటాను బాబు మందలించారన్నది తెలుస్తోంది. గంటాతో పాటు వెళ్లిన కూటమి నేతలు రుషికొండ భవంతుల్లోని ప్రతి రూమ్, హాల్‌లోనూ సందడి చేశారు. ఆ వీడియోలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసారమయ్యాయి. 'జగన్ మాయామహల్, జగన్ పేలస్' అంటూ పూర్తిగా గంటా శ్రీనివాసరావు పర్యటన ఆద్యంతం లైవ్ వీడియోలు దేశమంతటా వ్యాప్తి చెందడంతో రుషికొండపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. సుమారు రూ.500 కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడితో రుషికొండ భవనాలు నిర్మించారని, వాటిని ఎలా వినియోగించుకోవాలన్న ఆలోచన ప్రభుత్వం చేయనుందని, త్వరలో కూటమి పార్టీల అధినేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటన చేసి ఒక నిర్ణయం తీసుకుంటారని గంటా వెల్లడించారు. మున్ముందు ఏం జరుగనుందో చూడాలి.

కార్మిక నేత అప్పలరాజుకు అశ్రు నివాళి

మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిపిఎం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, తదితరులు నివాళ్లర్పించారు. అనంతరం సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అధ్యక్షతన సంతాప సభ జరిగింది. నాయకులు మాట్లాడుతూ అప్పలరాజు జగదాంబ ఏరియా 31వ వార్డు కృష్ణా గార్డెన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. 25 ఏళ్లుగా సిఐటియు, సిపిఎం సభ్యునిగా సంఘం, పార్టీ విస్తరణకు శ్రమించారని గుర్తుచేశారు. డివైఎఫ్ఐలో పనిచేస్తూ అనేక మంది యువకులను పార్టీలోకి తీసుకొచ్చారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆటో యూనియన్‌ను విస్తరించడానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన భార్య వరుణ మహిళా సంఘంలో పనిచేసారని, తమ్ముడు గణేష్ ప్రస్తుతం విశాఖ జిల్లా ఉపాధ్యక్షునిగా, సిపిఎం జగదాంబ జోన్ కమిటీ సభ్యునిగా పనిచేస్తున్నారని తెలిపారు. కుటుంబం మొత్తం ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి సాగించిందని అన్నారు. అప్పలరాజు మృతి ఆటో కార్మికులకే కాకుండా మొత్తం కార్మికవర్గానికి, పీడిత ప్రజానీకానికి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పట్ల న్యాయవాదుల హర్షం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయటం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ జిల్లా కోర్టు న్యాయవాదులు మంగళవారం కోర్టు సమీపంలో ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి లీగల్ సెల్ ప్రెసిడెంట్ బత్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, పార్టీ దక్షిణ నియోజవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. తొలుత న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ గిరిధర్, పృధ్వీరాజ్, ఎస్.కృష్ణమోహన్, ఎస్‌వి.రమణ, ఎస్.సతీష్ కుమార్, బాలకృష్ణ, దంతా నరేష్, ఎన్.మాధవరావు, డి.దుర్గాప్రసాద్, కన్నూరు అప్పలనాయుడు, ఎస్.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని అక్రిడిటేటెడ్ జర్నలిస్టులకు బుధవారం నుంచి ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం తెలిపారు. జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని స్పష్టం చేశారు. 2023-24 సంవత్సరంలో అక్రిడిటేషన్ పొందిన వారు ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రిపోర్టులు వచ్చాక వైద్యుని చెకప్‌కు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రోజుకు 50 మంది చొప్పున వారంలో ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే వైద్య పరీక్షల నిమిత్తం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు ముందుగా వారితో పాటు వారి జీవిత భాగస్వామి ప్రాథమిక వివరాలను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో తెలియజేయాల్సి ఉందన్నారు. మరిన్ని వివరాలకు 8008656504 నెంబరును సంప్రదించాలని కోరారు. వైద్య పరీక్షలు చేయించే నిమిత్తం ముందు రోజే ఆసుపత్రి వారికి వివరాలు పంపించాల్సి ఉన్నందున జర్నలిస్టులు సంబంధిత వివరాలను సమాచార శాఖ అధికారులకు వెంటనే అందజేయాలని సూచించారు.

మేయర్ పీఠంపై కూటమి కన్ను

టిడిపి కార్యాలయంలో కార్పొరేటర్ల సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్ పీఠంపై టిడిపి, జనసేన, బిజెపి కూటమి కన్నేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జనసేన కార్పొరేటర్లు ముగ్గురు, బిజెపి కార్పొరేటర్ ఒకరు వీరితో పాటు మరో 30 మంది వరకు కార్పొరేటర్లు హాజరైనట్లు తెలిసింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికార వైసిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమావేశంలో కొందరు కార్పొరేటర్లు చెప్పారు. కార్పొరేషన్‌లో 98 మంది కార్పొరేటర్లకుగాను 21వ వార్డు కార్పొరేటర్‌గా ఉన్న వంశీకృష్ణ శీనివాస్ తన పదవికి ఈసరికే రాజీనామా చేశారు. ఆయన వైసిపిని వీడి జనసేనలో చేరడం, ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం జరిగింది. దీంతో కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల సంఖ్య 97కి తగ్గింది. వీరుకాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా ఓటర్లుగా ఉంటారు.

నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత మరోసారి కార్పొరేటర్లతో విస్తృత స్థాయిలో సమావేశం జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. మారుతున్న జీవన శైలి మూలంగా అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని, ఈ పరిస్థితిని అదిగమించేందుకు అందరూ ఆరోగ్యం పట్ల అవగాహనతో మెలగాలని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వి - హెల్త్ కేర్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషాలిటీ వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. అనంతరం వి-హెల్త్ కేర్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో తమ వైద్య బృందం కృషి చేస్తోందని అన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కె.కమల ఫార్మసీని, కృష్ణ మెటర్నిటీ హాస్పిటల్ ఎమ్‌డి బిఎల్.నారాయణ ల్యాబ్‌ని, వి డెంటల్ హాస్పిటల్స్ ఎమ్‌డి డాక్టర్ జాన్ మాడుగుల డాక్టర్ ఛాంబర్‌ను, ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ ఎ.అప్పల నాయుడు మరో డాక్టర్ చాంబర్‌ను, ప్రముఖ జనరల్ మెడిసిన్ డాక్టర్ ఆర్‌వి.రవి కన్నబాబు నర్సింగ్ విభాగాన్ని, గైనకాలజిస్ట్ జి.శిరీష ఇసిజి విభాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిబివిఆర్.గుప్తా, వి.హెల్త్ కేర్ చీఫ్ చిన్నంకృష్ణ, అడ్మిన్ మేనేజర్ సిహెచ్.పార్వతి, కార్పొరేట్ మేనేజర్ కె.పృథ్వీరాజ్, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తీరును ఖండించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 14 సంవత్సరాల క్రితం చేసిన ప్రసంగంపై మేధావి అరుంధతీ రాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షాకేత్ హుస్సేన్‌లను ఉపా చట్టం కింద ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజా పౌర సంఘాల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి కన్వీనర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్ కె.పద్మ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.లలిత మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం ప్రసంగాలపై ప్రాసిక్యూట్ చేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించడం దుర్మార్గం అన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

కెజిహెచ్ నర్సింగ్ స్కూల్‌లో డెంగీ కేసు

యుద్ధ ప్రాతిపదికన పరిసరాలను శుభ్రపరిచిన అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ నర్సింగ్ స్కూలులో డెంగీ కేసు నమోదైంది. ఓ విద్యార్థినికి డెంగీ ఉన్నట్టు తేలడంతో మంగళవారం అధికారులు అప్రమత్తమయ్యారు. నర్సింగ్ స్కూల్ చుట్టుపక్కల అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రపరిచారు. మురుకుపోయిన డ్రైనేజీలు, మూతల్లేని సింటెక్స్ ట్యాంకులు ఉన్నట్టు గుర్తించారు. జివిఎంసి బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్ 4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మలేరియా విభాగం సిబ్బంది మంగళవారం ఉదయం కెజిహెచ్ అంతా యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రేయింగ్, మినీ ఫాగింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేశారు. ఎక్కడ చూసినా దోమలే ఉన్నట్టు గుర్తించారు.

ఎఎన్ఎంల ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎఎన్ఎంలు మంగళవారం విశాఖ నగరంలోని డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సచివాలయ ఎఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని నినదించారు.

Before the Deputy Registrar of Chits/ Arbitrator at Kakinada
A.A.C.F. No. 87 of 2023

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited (Formerly known as Margadarsi Chit Fund Ltd) Rajahmundry Branch, Rep. by its Foreman/ Manager ***...Disputant***
AND
S.Sivarama Krishna Murthy & Others ***...Opponents***

Opp-4: Murahari Srinivasulu, S/o. M.Sreehari, Hindu, aged 38 years, D.No. 1-33/A, Pudimaala (R), Janguluru (JW), Atchutapuram, Konempalem (V), Visakhapatnam.

డిస్‌ప్యూటెంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ మొత్తం **రూ. 74,495/-లు** రాబట్టుకొనుటకు మీపై దాఖలు చేసిన పై డిస్ప్యూటెంట్‌లో అపోనెంట్-4 అయిన మీకు పైన తెలిపిన ఆఫీసు వారు పోస్టు ద్వారా పంపిన నోటీసులు మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పైన తెలిపిన ఆఫీసు వారి ఆదేశాల ప్రకారము ఈపేపరు ప్రకటన ద్వారా నోటీసు యివ్వటం జరిగినది. కావున మీరు **ది. 06-07-2024వ తేదీన ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయముగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలను తెలియచేయవలసి ఉన్నది. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానం చేయబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

DEPUTY REGISTRAR OF CHITS
Kakinada

IN THE HON'BLE COURT OF THE IInd ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.No. 12 / 2024

Between:
Bandaru Devivara Prasad,
S/o. Late Venkata Ramana, D.No.277
Road no.4, N.G.O.Colony,
Chandrampalem, Madhurawada,
Visakhapatnam. . . . Petitioner
And:
1. Geddala Jagadesh,
S/o. Appalaswamy, H.No. 10399,
Velama Community Hall, Bobbili
2. Datti Appala Naidu (RMP Doctor)
S/o. Surpanaidu, Korada (P)
3. Chintala Ramarao (Real Estate)
Dadipalli Colony, Bobbili
4. Nalla Gowri Naidu,
Rajmahal Backside, Bobbili
5. Lalam Sanyasi Naidu,
D.No. 7-1-24, Vikalangula Colony,
Madhurawada, Visakhapatnam.
6. Lalam Satyavathi,
W/o. Sanyasinaidu, D.No. 7-1-24,
Vikalangula Colony, Madhurawada,
Visakhapatnam.
7. Polla Vijaya Kumar, S/o. Krishna,
H.No. 11441, Mehara Street,
RTC Comple Backside, Bobbili
8. Bammi Ganapathi, Rajeru (V)
Therla (m), Vizianagaram.
9. Sornapudi Prasad, Flat No. 201
D.No. 53-27-9, KRM Colony,
Visakhapatnam.
10. Nallamilli Ramana, S/o. Vadapalli,
D.No. 84-11/8/1, Sangeetharaopeta,
Samarlakota, E.G.Dist.
11. Gorle Vijayakumar,
S/o. Venkata Rao, D.No. 1-129,
Main Road, Ravikamatham (M)
Vedivada (V), Visakhapatnam Dist.
. . . Respondents

GENERAL NOTICE

The public is hereby informed that the above peitioner filed the above IP 12/24 on the file of the IInd Addl. Civil Judge (Senior Division) Visakhapatnam and the matter stands posted to **28-6-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **28-6-2024** either in person or through an advocate at **10-30 A.M.**

(By Court Order)
I.DIVYA DAS
B.NAGENDRA PRASAD
Advocates, Visakhapatnam
Visakhapatnam Cell : 8121212444
Dt. 18-6-2024

మెడ్‌టెక్ జోన్‌తో కలిసి గీతం ఎంబిఎ కోర్సు

హెల్త్‌కేర్, ఆసుపత్రుల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, అకాడమి ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా సరికొత్త ఎంబిఎ కోర్సును -2024 విద్యా సంవత్సరం నుంచి నిర్వహించనున్నాయి. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, తరగతి గది బోధనతో పాటు వైద్య రంగంలో అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అనుభవాలను జోడిస్తూ ఈ కోర్సును రూపొందించినట్లు వెల్లడించారు. దేశంలోని వైద్య ఆరోగ్య రంగం 2026 నాటికి 610 బిలియన్ డాలర్లకు చేరుకున్నదన్నారు. ముఖ్యంగా దేశంలో అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు ఆకర్షితులై ఇతర దేశాల నుంచి భారతదేశానికి వచ్చే వారి సంఖ్య (మెడికల్ టూరిస్ట్‌లు) పెరుగుతోందని పేర్కొన్నారు. పెరుగుతున్న ఆసుపత్రుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన విధంగా ఎంబిఎ హెల్త్‌కేర్ అండ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సు రూపొందించినట్లు వివరించారు. దీనికి సంబంధించి ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ -2024 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తత్సమాన కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు గీతం అడ్మిషన్ టెస్ట్ -2024కు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన నిపుణులను అందించడం గీతం విశ్వవిద్యాలయం బాధ్యతగా తీసుకున్నామని పేర్కొన్నారు. మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు డాక్టర్ ఎస్.మహేష్, డాక్టర్ గరీమా మాట్లాడుతూ, దేశంలో ఆసుపత్రులు, వైద్య కళాశాలలు ప్రారంభించే వారికి తాము ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కొవిడ్ సమయంలో మెడ్‌టెక్ జోన్ దేశీయంగా వైద్య ఉపకరణాలు తయారీలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. గీతంతో కలిసి నిర్వహిస్తున్న ఎంబిఎ హెల్త్‌కేర్ అండ్ హస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన వారికి వైద్య ఆరోగ్య రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ముఖ్యంగా హెల్త్ సర్వీసెస్ మేనేజర్, ఫార్మాస్యూటికల్ ప్రాజెక్టు మేనేజర్, మెడికల్ ప్రాక్టీస్ మేనేజర్, హెల్త్ ఇన్‌ఫర్మేటిక్స్ మేనేజర్, పబ్లిక్ హెల్త్ అడ్మినిస్ట్రేటర్, హెల్త్ కేర్ పాలసీ అనలిస్ట్ వంటి ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ బంగారురాజు, మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు డాక్టర్ అర్జున్, సంతోష్, గీత, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సు ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కోర్సు ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతం ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో వెంకటాపురం రోడ్డు లింగాపురం సమీపంలో కుంచ అప్పలనాయుడు మకాం వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ గంగరాజు ఇచ్చిన వివరాల ప్రకారం జగ్గంపేట గ్రామానికి చెందిన అల్లు దుర్గారావు(25), అతని సోదరుడు అల్లు రమేష్ ద్విచక్ర వాహనంపై వెంకటాపురం రోడ్డు నుండి నర్సీపట్నం వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం వారి ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అల్లు దుర్గారావు అక్కడికక్కడే మృతిచెందగా రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దుర్గారావు భార్య వారం రోజుల క్రితం బిడ్డకు జన్మనివ్వడంతో వారిని చూసేందుకు బైక్‌పై వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది, దీంతో కుటుంబం విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక ఎస్ఐ రమణయ్య ఆదేశాల మేరకు ఎఎస్ఐ గంగరాజు విచారణ చేపడుతున్నారు. దుర్గారావు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.గాయపడిన రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు,.

10వ వార్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్ రామలక్ష్మి

10వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి తోటగరువు, బివిఆర్.నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి మంగళవారం వివిధ శాఖల సిబ్బందితో కలిసి పర్యటించారు. వీధి దీపాలు, రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి సరఫరాపై పరిశీలించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడు అప్పలనాయుడు, కేతా సత్యనారాయణ, కొండమ్మ గ్రామ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన ఆనందపురం ఎంపిపి

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆనందపురం మండలం ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక తండ్రి మజ్జి వెంకటరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, ఆనందపురం ఎంపిడిఒ అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27న ఆనందపురం మండల సర్వసభ్య సమావేశం ఉన్నందున సమావేశానికి ఆహ్వానించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావును సన్మానించారు.

జోనల్ కార్యాలయ ఆధునికీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయ భవనం ఆధునీకరణ పనులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమిలి మెయిన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, ఫిష్, వెజిటబుల్ మార్కెట్ దుకాణ సముదాయం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ వెంట జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఎఇ ఎ.సుమన్, కార్య నిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు, ఎఎంహెచ్ కిషోర్, ఎసిపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి అపరాధ రుసుం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మందు తాగి వాహనం నడిపిన వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకెండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టులో 41 మందిని హాజరు పరచగా రూ.1500 నుంచి రూ.3 వేలు వరకు అపరాధ రుసుము విధించినట్లు సిఐ కాంతారావు తెలిపారు.

సాంకేతిక సమస్యలతోనే విద్యుత్ కోతలు : ఎఇ రవి

ప్రజాశక్తి -తగరపువలస : ఇటీవల విధిస్తున్న విద్యుత్ కోతలకు అనివార్యంగా ఉత్పన్నమైన కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు కారణమని చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ బి.రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వేళా పాళా లేని విద్యుత్ కోతలు' శీర్షికన ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. జివిఎంసి ఒకటో వార్డు కొండపేట పంప్ హౌస్ హెచ్‌టి సర్వీస్ నంబర్ విఎస్‌పి 189 మరమ్మతుకు గురైందని, దాన్ని పునరుద్ధరించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. చిట్టివలస 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ టౌన్ ఫీడర్‌పై 200 యాంప్స్ సామర్థ్యం మించి లోడ్ అయినందున భీమిలి మండలం తాళ్లవలస 33 / 11 కెవిలో లోడ్‌ను మార్చే క్రమంలో విద్యుత్ కోతలు జరిగాయని పేర్కొన్నారు. చిట్టివలసలో నిర్వహణ పనుల నిమిత్తం (విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుట) విద్యుత్ సరఫరా నిలిపి వేసినట్లు వివరించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కీర్తిశేషులు ప్రవళికరెడ్డి జయంతి సందర్భంగా మజ్జివలస జంక్షన్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటుచేసిన శిబిరంలో సుమారు 40 మంది రక్త దానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ జివి.నారాయణ, జిఎన్ఎస్ కమ్యునికేషన్ అధినేత గాడు అప్పలనాయుడు, స్థానికులు గాడు తాతినాయుడు, తుపాకుల అప్పలనాయుడు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -మధురవాడ : ఎన్‌డిఎ కూటమి విజయం సాధించిన సందర్భంగా మారికవలస శారదానగర్‌లోని వికలాంగుల సంక్షేమ గృహానికి ధనుంజయ్ సహకారంతో వారి మిత్రులు విశాఖ రూరల్ జనసేన జాయింట్ సెక్రటరీ బిటిడి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం నిత్యావసర వస్తువులు అందించారు. భీమిలి జనసేన నాయకుల ఆధ్వర్యాన మరికొంతమంది రూ.20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించారు.

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి - ఆరిలోవ : 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడి బయట తిరిగే పిల్లలను బడిలో చేర్పించేందుకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ ఎల్.చంద్రకళ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయభాస్కర్, మండల విద్యాశాఖాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, మండల విద్యాశాఖాధికారులు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి పాఠశాల పరిధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిఎస్ అందరూ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పిల్లలు పాఠశాలలో ఉన్నారో లేదో పరిశీలించి, బడిలో చేర్పించే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లా, మండల, హేబిటేషన్ కమిటీల ఆధ్వర్యాన జులై 12వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యార్థులను చేర్పించుకోవాలన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిసి సోషల్ వెల్ఫేర్ డిడిలు రామారావు, శ్రీదేవి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ మోహన లక్ష్మి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆస్ట్రేలియా శాస్త్రవేత్త పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడకుండా, ఆవుపేడ, మూత్రం, వేపాకు, బెల్లం, పుట్టమట్టి, నిమ్మకాయలు, నీటితో కలిపి జీవామృతం, బీజామృతంగా తయారుచేసి పంటలకు వేస్తే చీడపురుగులు సోకకుండా పంటలు ఏపుగా పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా గోంగూర, తోటకూర, పాలకూర, బెండ, దొండ, వంకాయ, టమోటా, క్యాబేజీ, కేరట్, బీట్‌రూట్, బొప్పాయి, మిరప, రాగులు, సామలు, అరికెలు, కొర్రలు, గంటెలు, సజ్జలు అనేక రకాల పంటలను ఇదే ఎరువుతో పండిస్తున్నామని రైతులు శాస్త్రవేత్తకు తెలియజేశారు. ఈ ప్రకృతి వ్యవసాయ పంటలు చూడటానికి ఆస్ట్రేలియా నుంచి శాస్త్రవేత్త రెబెకా, విశాఖజిల్లా అగ్రికల్చర్ అధికారులు కృష్ణారావు, మోహనరావు, ప్రకాశ్, స్థానికులు అక్కరమాని ఆదినారాయణ, బాయిన కోటి, రెల్లి సూరిబాబు తర్లువాడ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆస్ట్రేలియా శాస్త్రవేత్త రెబెకా

స్టూడెంట్ కిట్లు పంపిణీ

విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎండిఒ డాక్టర్ జానకి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఎండిఒ డాక్టర్ వి.జానకి, ఎంఇఒ ఎం.శివరాణి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్.సింహాచలం, ఉపాధ్యాయులు నయీమ్ అన్సారీ, సుజాతకుమారి, రామకృష్ణ, తులసి, లక్ష్మి పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జివి.నారాయణ, హెచ్ఎం జి.సత్యనారాయణ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి సత్తిబాబు

డ్రగ్స్ మూలాలపై ప్రత్యేక దృష్టి

డిసిపి మోకా సత్తిబాబు

ప్రజాశక్తి- గోపాలపట్నం : డ్రగ్స్ మూలాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిసిపి మోకా సత్తిబాబు తెలిపారు. ఆర్ అండ్ బి జంక్షన్ వెస్ట్ సబ్ డివిజన్ ఎసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు గంజాయి నివారణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ను రూపొందించామన్నారు. గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపేందుకు యాక్షన్ టీం పని చేస్తుందన్నారు. ఇప్పటికే గంజాయి వినియోగిస్తున్న కొన్ని ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో నిత్యం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అందులో భాగంగా పోలీసులను, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేస్తూ యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటుచేసి డ్రగ్స్ సరఫరాపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేసే విధంగా పెందుర్తి సరిపల్లి వద్ద చెక్ పోస్ట్ను ఏర్పాటు చేసి అదనపు సిబ్బందితో నిరంతరం వాహనాలను తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. జోన్ -2 పరిధిలో ఇప్పటికే 185 ఎన్డిపిఎస్ కేసులు నమోదయ్యాయని, 339 గంజాయి కేసులు ట్రయల్లో ఉన్నాయని, ఆయా కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. గంజాయి రవాణాపై సమాచారం ఉంటే ప్రజలు తమకు తెలియజేయాలని కోరారు. అంతకుముందు వెస్ట్ సబ్ డివిజన్కు సంబంధించి సిఐలతో గంజాయి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరిస్తూ సమీక్షించారు. సమావేశంలో వెస్ట్ సబ్ డివిజన్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, హార్బర్ ఎసిపి బి.మోసెస్పాల్ తదితరులు పాల్గొన్నారు.

89, 92 వార్డుల్లో గణబాబు పర్యటన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్, రజక కాలనీ, ఆదర్శనగర్లో, 92వ వార్డు పరిధి పద్మనాభనగర్, కంపరపాలెం ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే గణబాబు, జోన్-8 అధికారులతో కలిసి పర్యటించారు. గణపతినగర్ ప్రధాన మురుగు గెడ్డను పరిశీలించారు. గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి మురుగు నీరు పోయే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో ఇక్కడ వ్యాధులు ప్రబలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. గణపతినగర్ ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కార దిశగా చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు.

జివిఎంసి 92వ వార్డు పద్మనాభనగర్లో పర్యటించారు, టిడ్కో ఇళ్లపై అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి పేద ప్రజలకు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు టిడిపి కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, బొద్దేటి విజయ్, మరడ ప్రదీప్, దాడి సురేష్, అధికారులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు శివారు ప్రాంతం పద్మనాభపురంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే గణబాబు మంగళవారం సందర్శించారు. కొన్ని బ్లాక్లో ఉన్న గదులను పరిశీలించారు. గతంలో తమ హయాంలో కేటాయించిన వాటిలో మార్పులు ఏమైనా జరిగాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేసే లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టిడ్కో హౌసింగ్పై రివ్యూ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ ఉక్కును ఐక్యంగా కాపాడుకుందాం

తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కును ఐక్యంగా కాపాడుకుందామని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. తనను గాజువాక ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఉక్కు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు, నిర్వాసితులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న గర్భాం మాంగనీస్ మైన్, కింతాడ క్వర్ట్జ్ మైన్, సారిపల్లి ఇసుక రీచ్ లను ఈ నెలలోనే విశాఖ ఉక్కుకు రెన్యువల్ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్టీల్ప్లాంట్ను రక్షించడమే ప్రధాన ఆశయంగా పనిచేస్తానన్నారు. రాష్ట్రంలో ఏ పదవి ఇచ్చినా ప్లాంట్ రక్షణ ముందు తనకు తృణపాయమని చెప్పారు. విశాఖ స్టీల్ప్లాంట్ను భావితరాలకు అందించడమే తన ప్రధాన ధ్యేయమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ను కలుపుకుంటూ స్థానిక స్టీల్ యాజమాన్యంతో ఈ నెల 24వ తేదీలోపు చర్చించి, సమగ్ర ప్రణాళికను తయారుచేసి కేంద్ర ప్రభుత్వం ముందు ప్రతిపాదిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, పల్లా శ్రీను, పులి రమణారెడ్డి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్, నీరుకొండ రామచంద్రరావు, విళ్లా రామ్మోహన్కుమార్, యు రామస్వామి, గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ప్లాంట్ గడ్డు పరిస్థితిపై పల్లాకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ప్లాంట్ ప్రస్తుతం గడ్డుపరిస్థితిలో ఉందని, నివారణకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే, తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఆయన కార్యాలయంలో స్టీల్ సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గనులను విశాఖపట్నం స్టీల్ప్లాంట్కు గతంలో కేటాయించారని వాటిని గత ప్రభుత్వం రెన్యువల్ చేయకుండా ఆపిందని, తక్షణం రెన్యువల్ చేయాలని కోరారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ, గతంలో స్థానిక యాజమాన్యం ప్లాంట్ వృద్ధి కోసం కృషి చేసేవారని, నేటి యాజమాన్యం దానికి విరుద్ధంగా నడుస్తోందని, దీనిపై కేంద్రమంత్రికి వివరించి చర్యలు చేపట్టాలని కోరారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ప్లాంట్ మనుగడ సాగించాలంటే తక్షణసాయంగా వర్కింగ్ క్యాపిటల్ను అందిస్తూ, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన రా మెటీరియల్ను అందించే చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ మాట్లాడారు. స్టీల్ప్లాంట్ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగిన కృషి అంతా చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గనుల కేటాయింపు రెన్యువల్కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ అందరి మద్దతుతో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచానని, ప్లాంట్ సమస్యను పరిష్కరించేంతవరకు తన ప్రయత్నాలను కొనసాగిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, కె.గంగాధర్, నీలకంఠం, మరిడయ్య, కృష్ణమూర్తి, మహేష్, వి.ప్రసాద్, రాజా, అప్పలరాజు, పవన్, ఒప్పంద కార్మిక సంఘాల ప్రతినిధులు జి.శ్రీనివాస్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాసరావుకు సమస్యలను వివరిస్తున్న స్టీల్ సిఐటియు నాయకులు

మోటూరు చూపిన మార్గంలో నడుద్దాం

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు

మోటూరు హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, సిబ్బంది

ప్రజాశక్తి-గాజువాక : ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు చూపిన మార్గంలో నడుద్దామని సంస్థ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో మంగళవారం మోటూరు హనుమంతరావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేశారన్నారు. సుదీర్ఘకాలం పాటు ప్రజాశక్తి సంపాదకులుగా మోటూరు హనుమంతరావు పనిచేశారని గుర్తుచేశారు. ఆయన రాసిన వ్యాసాలు ప్రతి ఒక్కరినీ కదిలించేవిగా ఉండేవని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధం విధించినప్పుడు అక్కడున్న పార్టీ కార్యకర్తలను విజయవాడకు తరలించి ఆశ్రయం కల్పించారన్నారు. ఆయన ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగా పదవులు నిర్వహించారని గుర్తుచేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ

వస్త్రాలు సమర్పించిన ఈవో, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సింహాచలం : అప్పన్న సోదరి అడవివరం గ్రామదేవత పైడితల్లమ్మ వార్షిక పండగ మహోత్సవాన్ని గ్రామస్తులు, దేవస్థానం అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునుంచే గ్రామస్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం తరపున ఈవో సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు అమ్మవారికి వస్త్రాలను సమర్పించారు. మధ్యాహ్నం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అమ్మవారికి వస్త్రాలను సమర్పించారు. ఆయన వెంట వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, పంచదార శ్రీనివాసరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

52వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్ ప్రాంతంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పర్యటించారు. రజకవీధి, ఉడా లే-అవుట్ ప్రాంతాలలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఇ ఉషా, వర్క్ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, పారిశుధ్య విభాగం అధికారి మూర్తి పాల్గొన్నారు.

పల్లా దృష్టికి భాషోపాధ్యాయుల సమస్యలు

ప్రజాశక్తి-గాజువాక: తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆరికె మాస్టారు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. భాషోపాధ్యాయుల సమస్యలను పల్లాకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, ప్రధాన కార్యదర్శి ముమ్మిడివరపు రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంచమాంబ అమ్మవారి పండగ

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార కుంచమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శతకం పట్టు వద్ద అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ మాధవ యువజన సమాజం నిర్వాహకులు పర్యవేక్షించారు. అమ్మవారి పండగకు విరాళాలు ఇచ్చిన దాతలను శ్రీ మాధవ యువజన సమాజం సభ్యులు అభినందించారు. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, మానవసేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాలరావు, సహాయ కన్వీనర్ వప్పల రామచంద్రరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్, విశాఖపట్నం రైల్వే డివిజన్ కో-ఆర్డినేటర్ వప్పల రామమోహనరావు, 51వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల కీర్తి, కళా హాస్పిటల్ ఎమ్డి డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి, 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వైసిపి మహిళా నాయకులు పేడాడ రమణి కుమారి, బిజెపి నాయకులు తమ్మినేని పద్మజ, తమ్మినేని లోహితరావు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వప్పల శ్రీహరి, శ్రీ మాధవ యువజన సమాజం సభ్యులు, మాధవధార గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న రామ్గోపాలరావు

22, 23 తేదీల్లో సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం
- సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-చోడవరం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 22, 23 తేదీలలో రెండు రోజుల పాటు చోడవరంలోని శ్రీకాంత్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. చోడవరంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు జయప్రదానికై చోడవరం మండల ప్రజలు సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం ఈ కాలంలో రైతాంగ సమస్యలపైనా, సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించాలని, రైతులకు బకాయిలు చెల్లించాలని, కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు కోసం పోరాడినట్లు చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని, ఈ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని, చోడవరం - అనకాపల్లి రోడ్డులో శిథిలమైన కల్వర్డులు, రోడ్లు వేయాలని, గ్రామాల్లో మౌళిక సదుపాయలు కల్పించాలని ఉద్యమించినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ, ఆశ, మిడ్డేమీల్స్, వివిఎ, గ్రామ పంచాయితీ, విఆర్ఏ, ఆటో, ముఠా, బిల్డింగ్ తదితర కార్మికుల సమస్యలపై నిత్యం పనిచేస్తున్నట్లు చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలపై పోరాడినట్లు పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సహా ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసినట్లు గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పోరాటాలకు సంఘీభావంగా నిలుస్తుందని, విద్య, వైద్యం మెరుగు పర్చాలని కృషి చేస్తుందని, కులవివక్షకు వ్యతిరేకంగా, మతసామరస్యాన్ని కాపాడాలని ఉద్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల తరుపున మరింత పట్టుదలగా పని చేయడానికి, అవగాహన కల్పించడానికి కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు డి.వెంకన్న, ఎస్వీ నాయుడు, వివి.శ్రీనివాసరావు, జి.నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, జి.దేమున్నాయుడు, సిహెచ్.శివాజీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అంగన్వాడీ కేంద్రం పక్కనే చేపడుతున్న నిర్మాణం

అంగన్వాడీ స్థలంలో అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-3 ఆవరణలో గ్రామానికి చెందిన పలువురు అక్రమంగా నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజాం- మల్లం రోడ్డో రోడ్డుకు సమీపంలో అంగన్వాడీ కేంద్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించారు. సమీపంలో గల ఖాళీ స్థలాన్ని ఆట స్థలంగా వినియోగించుకోవడానికి నిర్ణయించారు. అయితే కొద్ది రోజులుగా అధికారులు ఎన్నికల హడావిడిగా ఉండడంతో గ్రామానికి చెందిన పలువురు అంగన్వాడీ కేంద్రం పక్కన గల ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు. దీనిపై పిల్లలు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు సన్మానం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, వడ్డాది టౌన్ ఉపాధ్యక్షులు సింగంపల్లి రమేష్ తదితరులు మంగళవారం గాజువాకలో కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో సయ్యపరెడ్డి జగదీష్ పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యాన

అనకాపల్లి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావును, విశాఖ దక్షణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు భరణికాన సాయినాథబాబూరావు ఆధ్వర్యంలో మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలు, సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు భరణికాన నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, నాయకులు పంచదార్ల సూరిబాబు, వియ్యపు సింహాచలం, బంధం వెంకటరమణ, వియ్యపు అప్పలరాజు, కోన సోమేశ్వరరావు, కోరాడ శ్రీనివాసరావు, మొల్లి కనకరాజు, గజ్జి నరసింగరావు, నరేష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌ను కలిసిన యాదవ సంఘం నాయకులు

ఫార్మాసిటీ కాంట్రాక్టు కార్మికులకు

పెరిగిన విడిఎ అమలు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి విడుదల చేసే విడిఎ కరువు భత్యం ఫార్మా పరిశ్రమల అన్నింటిలో అమలు చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పరవాడ ఫార్మాసిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు కార్మికులకు రోజు కరువు భత్యం ఒక్కసారి రూ.10, రూ.20 పెంచి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందన్నారు. షెడ్యూల్ పరిశ్రమగా ఉన్న గత 12 సంవత్సరాలుగా జీవో సవరించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యాజమాన్యాలకి అండగా ప్రభుత్వాలు నిలుస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం షెడ్యూల్ పరిశ్రమ ఫార్మాసిటీలో వేతనాల జీవో సవరించి కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీడిఏ పాయింట్స్ అన్ని పరిశ్రమల్లో అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇఎస్ఐ, పిఎఫ్, కనీస వేతనాలు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.దేముడు, కె.వెంకునాయుడు, కె.ధారబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలను కలిసిన అధికారులు

ఎమ్మెల్యే కొణతాలతో అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక రింగ్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణను వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, మహిళలు, వికలాంగులు మర్యాద పూర్వకంగా కలిశారు. జీవీఎంసీ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ, డిఆర్డిఏ అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, కొణతాల రమణబాబు, రాపేటి రామ్‌కుమార్, చదరం కాశి, గోవిందరావు మాస్టర్, చదరం నాగేశ్వరరావు, సందిన సునీల్, కర్రి రమేష్, పీలా తాతు నాయుడు, చదరం అర్జున్ నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఎస్‌సి, బిసి కళాశాల

మహిళా వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఎస్‌సి, బిసి కళాశాల మహిళా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన జిల్లా సంక్షేమ శాఖ అధికారి అజయ్ బాబు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరికి మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో వివిధ దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, వారికి వసతి గృహాలు లేక బయట రూములలో తీసుకొని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో మహిళా కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేస్తే వారంతా చదువుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ, నాయకులు జగదీష్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పట్ల నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : పలు పనుల మీద సచివాలయానికి వచ్చే ప్రజలను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి సమస్యను అడిగి తెలుసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని టిడిపి 84వ వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలాబాబు సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని 12వ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు కుప్పిలి జగన్మోహన్, పిల్లా తారకేష్, తలారి లక్ష్మీప్రసాద్, రేబాక ఈశ్వరఅప్పారావు, శ్రీకాకుళం గణపతి, కాండ్రేగుల జగదీష్, లోవరాజు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సన్యాసినాయుడు, చిన్న

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ గ్రామపంచాయతీ పరిధి ధర్మారాయనపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూలుకు కావలసిన మౌలిక సదుపాయాలన్నీ పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుతో మాట్లాడి త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సారిపెల్లి జోగినాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ గొలగాని బాబూరావు, మోటూరు హరిబాబు, మోటూరు కాశి, హెచ్ఎమ్ సన్యాసిరావు, ముప్పల అనకేశ్వరి, దేవి, శ్రీవాణి, శిరీష పాల్గొన్నారు.

ఇవిఎంలపై నెపం నెట్టడం శోచనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి గెలిస్తే తనను చూసి ప్రజలు ఓట్లు వేశారని, ఓడితే ఈవీఎంలపై నెపం నెట్టి వేయడం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఈవీఎంలపై 2019లో జరిగిన ఎన్నికల్లో తనకు 151 సీట్లు వచ్చినప్పుడు ఈవీఎంలు గొప్పగా ఉన్నాయని చెప్పిన జగన్ 2024లో ఓటమి చెందిన తర్వాత ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయడం వైసిపి కార్యకర్తలను, నాయకులను కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నట్లు ఉందని పేర్కొన్నారు. ఓటమి చెందిన తర్వాత జగన్ మతిస్థిమితం కోల్పోయారని, కళ్ళు మూసుకుని పరిపాలన చేశామని పశ్చాత్తాప పడకుండా ప్రజలకు నేను డబ్బులు ఇచ్చాను నాకు ఓట్లు వేయలేదు ఏదో జరిగిపోయిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఆత్మ స్తుతి పరనిందలు మాని తమ 5 సంవత్సరాల పరిపాలనపై సమీక్ష చేసుకుంటే వాస్తవాలు తెలుస్తాయని హితవు పలికారు.

కన్యకా పరమేశ్వరికి కొణతాల పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మంగళవారం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో ఛైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మండల కేంద్రం రాంబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం సందర్శించారు. ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సత్కరించారు. హైస్కూల్లో సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు విదిన్నాబు, ధూళి రంగనాయకులు, పప్పల నూకన్నదొర, ఎంపిడిఓ ఎస్.వెంకటాచలం, ఎంఇఒ ఎం.సూర్యారావు, సూర్యనారాయణ, పాఠశాల కమిటి ఛైర్మన్ వర్మ, పలువురు ప్రజా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతిరావు

డయేరియాపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కశింకోట
కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందికి డయేరియాపై అవగాహన సదస్సు డాక్టర్ ఎస్.తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 0- 5 సంవత్సరాల లోపు చిన్న పిల్లల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి విరోచనాలతో బాధ పడుతున్న వారిని గుర్తించి చికిత్సలు చేయాలని, తీవ్రత ఉన్న వారిని ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. ఈ వ్యాధిని అరికట్టడానికి పరిశుభ్రమైన మంచి నీరు, ఆహారం తీసుకోవాలని, శిశువులకు తల్లి పాలు అందించాలని, బయట దుకాణాలలో దొరికే ఆహారం తినరాదని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-చోడవరం : బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలోకి చేర్పించాలని స్థానిక ఎంపీడీవో చైతన్య పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బడి బయట పిల్లల గుర్తింపు సర్వే ఓరియెంటేషన్ కార్యక్రమం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలు అందరిని బడిలోకి చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం, ఎంపిపి గాడి కాసు, అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి, చోడవరం బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ సంధ్య, సచివాలయ విద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ గార్డ్ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు ఏప్రిల్, మే నెలలు జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయన్నారు. దీనికి స్పందించిన సూపరింటెండెంట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతాలు చెల్లించిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.సంతోష్, అడవి రాజు, శివ, ఝాన్సీ, మహాలక్ష్మి నాయుడు, ఉమా, వరలక్ష్మి, సింహచలం, జ్యోతి, రవి, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

పల్సర్ బైక్ గాయకుడు రమణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పల్సర్ బైక్ గాయకుడిగా పేరుగాంచిన రమణ జన్మదిన వేడుకలు విశాఖ గాజువాక జనరేషన్ యువ పిల్లల అనాధాశ్రమంలో ప్రొడ్యూసర్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అనాధ పిల్లలకు ఆటపాటలు మ్యాజిక్ కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలతో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రమణ అభిమానిగా ఎంతో గర్వపడుతున్నామని, వందలాది నుంచి వేలాది ప్రదర్శనలు రమణ అందించారని తెలిపారు. తన ఆహ్వానాన్ని మన్నించిన జిఆర్కే అధినేత జి ఈశ్వరరావు, నటులు మెజీషియన్ దామోదర్, లఘు చిత్ర దర్శకులు నాని నాయుడు, అజయ్‌లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితా నాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లవ్లీ బాయ్స్ (వారియర్స్) యూత్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రసాదం, మజ్జిగను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో డప్పులు, మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.

'మురికి' శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ

యానాద్రి కాలువ పూడికతీత పనులు వేగవంతం

ప్రజాశక్తి - యలమంచిలి
యలమంచిలి పట్టణానికి పురాతనమైన అతి పెద్ద యానాద్రి కాలువ పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణానికి నడిబొడ్డున ఉన్న ఈ కాలువ ఎఎస్ఆర్ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు చివరి వరకూ కొనసాగుతుంది. యానాద్రి కాలువ నీరు రైలు ట్రాక్ దాటే చోట వంతెన నిర్మించి రెండో పక్కనున్న చెరువుకు కలిపారు. దాంతో కాలనీ నీరు యానాద్రి కాలువకు చేరకుండా నిలువరించారు. అయితే వాడుక నీరుకు వర్షం నీరు తోడై కొత్తపేట, యాతపేట, మెయిన్‌రోడ్డు మీదుగా పంట కాలువకు చేరుతుంది. సుమారు 2 కిలోమీటర్లు పొడవుండే ఈ కాలువ పూడికపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉండిపోతుంది. దీంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఒక పక్క దోమల బెడద, మరో మురికి కంపు, వర్షాలకు ముంపుతో ఈ కాలువ రెండువైపులా నివసించే కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ ఇబ్బందులకు పరిష్కారంగా మున్సిపాలిటీ గట్టి చర్యలు చేపట్టింది. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో మొత్తం యానాద్రి కాలువ పూడికతీత పనులు ప్రారంభించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్ తెలిపారు. చైన్ జెసిబి సాయంతో సుమారు 4 అడుగుల పూడిక పనులు ఇటీవల ప్రారంభించి వారం పది రోజుల్లో పూర్తి చేయనున్నట్టు ఆయన చెప్పారు. వర్షాలకు ముందే పూడిక పనులు పూర్తయితే మురికికి శాశ్వత పరిష్కారం లభించినట్టవుతుందని వెల్లడించారు. మున్సిపాలిటీలో మొత్తం 100 మంది పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారని, ఇటీవల చెత్త రవాణాకు సచివాలయానికి ఒకటి చొప్పున మున్సిపాలిటీకి 13 ఎలక్ట్రికల్ వాహనాలు ప్రభుత్వం సమకూర్చడంతో చెత్త తరలించే పనులు మరింత వేగవంతం అయ్యాయని శ్రీనివాస్ చెప్పారు.

జెసిబితో పూడిక తీత పనులు చేస్తున్న దృశ్యం

పిఎం కిసాన్ కింద జిల్లాకు రూ.37.72 కోట్లు విడుదల

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి- అనకాపల్లి
ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద అనకాపల్లి జిల్లాకు 37 కోట్ల 72 లక్షల రూపాయల విడుదల అయినట్టు జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులైన రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పీఎం కిసాన్ యోజన పథకం 17వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారణాసిలో విడుదల చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని లబ్ధిదారులు స్మార్ట్ టీవీ ద్వారా వీక్షించారు. జిల్లాలో ఈ పథకానికి 1,88,614 మంది రైతులు అర్హులైనట్టు తెలిపారు. వారి వారి ఖాతాల్లో ఈ సొమ్ము జమ అవుతుందన్నారు.

భీమునిపట్నం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద లబ్ధిదారులైన ఒక్కో రైతు బ్యాంక్ ఖాతాలో రూ.2000 చొప్పున మంగళవారం ప్రధానమంత్రి విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ అధికారులు టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు. తాటితూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఎడి విజయప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, ఆర్‌బికె వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : పిఎం కిసాన్ యోజన 17వ విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని మండలంలోని వేములవలస పంచాయతీలో టీవీ ద్వారా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. బంటుపల్లి కల్లాలు, వేములవలస పంచాయతీల్లో 350 మంది రైతులకు పిఎం కిసాన్ యోజన అందుతుందని అధికారులు తెలిపారు.

గొలుగొండ : చోద్యం రైతు భరోసా కేంద్రంలో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమంపై మండల వ్యవసాయాధికారి సుధారాణి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గాదె శ్రీనివాసరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఎన్నికల్లో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులకు ప్రతి ఏడాది బడ్జెట్లో రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని, నెలకు రూ.5000 పింఛన్ ఇవ్వాలని కోరారు. మద్యం షాపులో 40 శాతం షాపులు గీత కార్మికులకు గ్రామీణ ప్రాంతంలో రూ.45,000, అర్బన్ ప్రాంతంలో రూ.55000 ఫీజులు కట్టించుకుని ఎటువంటి పాటలు లేకున్నా కేటాయించాలన్నారు. పెళ్ళికానుక లక్ష రూపాయలు ఇవ్వాలని, చెరువు గట్ల మీద తాటి, కొబ్బరి చెట్లు గీత కార్మికులు పెంచుకోవడానికి ఉపాధి హామీ నిధులు కేటాయించాలని, విద్యా వైద్యం ఉచితంగా ప్రభుత్వం అందించాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. పై డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తుమ్మపాల సుగర్స్ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ దినసరి వేతన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు గొర్లి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఫ్యాక్టరీ ఆవరణలో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు మంగళవారం కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దినసరి వేతన కార్మికులను చిన్నచూపు చూసిందన్నారు. ఫ్యాక్టరీని అర్ధాంతరంగా మూసేయడంతో పాటు తమకు రావాల్సిన బెనిఫిట్స్ అందించలేదన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, పలువురు మనోవేదనతో ప్రాణాలు సైతం విడిచారని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఫ్యాక్టరీ పునరుద్ధరణపై దృష్టి సారించి ఆధునికీకరణ చేసి కార్మికులను రైతులను ఆదుకోవాలని కోరారు.

బిఎన్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొమ్మలపూడి వద్ద బిఎన్ రోడ్డును స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. కొంతకాలంగా ఈ రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడి రాకపోకలకు ఏమాత్రం అణువుగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శాసనసభ్యులు రాజు ఆ రోడ్డున పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తమరాన దాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు, ఆర్ అండ్ బి అధికారులు

గంగాధర్ మృతిపై అనుమానాలు?

ప్రజాశక్తి-చోడవరం
మండలంలోని అంబేరుపురంలో ఈ నెల 9న మృతి చెందిన గంగాధర్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంగాధర్‌ను అదే గ్రామానికి చెందిన కొంత మంది కొట్టి చంపారన్న ఆరోపణలు ప్రస్తుతం వినిపిస్తున్నాయి. గంగాధర్ చోడవరం చక్కర కర్మాగారంలో చిరు కార్మికుడిగా పని చేసేవాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గతంలో అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో గంగాధరకు వివాహేతర సంబంధం ఉండేది. ఈ నేపథ్యంలో గంగాధర్ ఆ మహిళను విచక్షణారహితంగా గొంతు కోసి చంపడంతో నాడు ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన గంగాధర్‌ను గ్రామస్తులు గ్రామంలోకి రానివ్వలేదు. దీంతో గాజువాకలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ నెల 8వ తేదీన గంగాధర్ గ్రామానికి వచ్చి తన ఇంటి మరమ్మతు పనులు చేపట్టాడు. ఈ క్రమంలో 9వ తేదీన కొంతమంది వ్యక్తులు అతనిపై దాడి చేసి హత్య చేశారని ఇప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అప్పట్లో గ్రామస్తులుగాని, కుటుంబీకులుగాని ఎవరు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సంఘటన స్థలానికి వెళ్ళిన గ్రామస్తులకు గంగాధర్ కడుపు నొప్పితో చనిపోయాడని చెప్పడంతో ఎవరు దీనిపై పెద్దగా పట్టించుకోలేదు. గంగాధర్‌ది హత్యని ప్రస్తుతం గ్రామంలో పలువురు చర్చించుకుంటున్న నేపథ్యంలో దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపితే నిజానిజాలు బయటకొచ్చే అవకాశం ఉంది. గంగాధర్ గతంలో అనేక నేరాలకు పాల్పడ్డాడని గ్రామస్తులు అంటున్నారు.

ఘనంగా లోవాంబిక జాతర

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మండలంలోని గోకివాడ గ్రామంలో శ్రీలోవాంబిక అమ్మవారి జాతర మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. స్థానికులతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలను నివేదించి, తమ మొక్కలను చెల్లించుకున్నారు. అమ్మవారి జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పలువురు నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు వి.సినాబాబు, పి.నూకన్నదొర, సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లను సిద్ధం చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు ఆదేశం
- వచ్చే నెల 18న ప్రారంభిస్తామని వెల్లడి

అన్నాక్యాంటీన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : వచ్చేనెల 18న అన్నా క్యాంటీన్ ప్రారంభించేందుకు వీలుగా ప్రస్తుతమున్న భవనాన్ని అన్ని హంగులతో సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబును స్థానిక ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. మంగళవారం ఉదయం నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో మాదిరిగానే అన్నా క్యాంటీన్ అనే అక్షరాలు స్పష్టంగా కనిపించేలా పూర్వపు రంగులే వేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గత ప్రభుత్వ హయాంలో ఈ భవనంలో అర్బన్ పిహెచ్‌సిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది లేకపోవడంతో ఇందుకు సంబంధించి తీసుకో వాల్సిన చర్యలపై చర్చించారు. ఏడాదికాలంగా తన సొంత నిధులతో అన్నాక్యాంటీన్ వద్ద పేదలకు భోజనం అందిస్తున్నానని, ప్రభుత్వపరంగా అన్నాక్యాంటీన్ ప్రారంభించాక దాన్ని నిలుపుదల చేస్తామన్నారు. అయితే మరిడి మహాలక్ష్మి ఆలయం వద్ద ప్రతి సోమవారం తన సొంత ఖర్చులతో అన్నదానం కొనసాగిస్తానని అయ్యన్నపాత్రుడు తెలిపారు.

ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణానికి
మున్సిపాలిటీ నిధులెలా కేటాయిస్తారు?

- అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే అయ్యన్న
- వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని అబీద్‌సెంటర్‌లో వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులను రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. శారద నగర్ రోడ్డు విస్తరణ పనులు, వాటి నాణ్యతను కూడా అయ్యన్న పరిశీలించారు. కనకదుర్గ గుడి రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉందని, ఇందులో కొంత భాగాన్ని తొలగించైనా రోడ్డు విస్తరించాలని అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్లు భవనాల శాఖకు చెందిన రోడ్డు విస్తరణకు మున్సిపాలిటీ నిధులు ఎలా ఖర్చు చేస్తారని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు నాణ్యత, మున్సిపల్ నిధుల వినియోగంపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను, రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపాలిటీ డబ్బులను వినియోగించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేదని ఆరోపించారు.

రోడ్డు నిర్మాణ నాణ్యతపై అసంతృప్తి
బిల్లులు చెల్లించొద్దంటూ అధికారులకు ఆదేశం

గొలుగొండ: నర్సీపట్నం, కేడీపేట మార్గంలోని అరిలోవ అటవీ ప్రాంతంలో నిర్మించిన తారురోడ్డును నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, బెర్మలు వేసే సమయంలో 10 టన్నుల బరువు గల రోలర్‌తో తొక్కించకుండా కేవలం మూడు టన్నుల కెపాసిటీ కలిగిన రోలర్‌తో రోడ్డు వేశారన్నారు.. కల్వర్టులు కట్టకుండా అర్ధరాత్రి సమయంలో తారు రోడ్డు వేయడమేటని అధికారుల్ని నిలదీశారు. ఈ రోడ్డుకు బిల్లు మంజూరు చేస్తే ఊరుకునేది లేదని అధికారులకు హుకుం జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఇ కాంతిమణి, పాడేరు ఇఇ బాలసుందరంబాబు, నర్సీపట్నం డిఇఇ నాగమోహన్, కెడిపేట ఎఇ ప్రసాద్, మండల నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, చిటికెల సాంబమూర్తి, సర్పంచ్ అడపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి తారక వేణుగోపాల్ పాల్గొన్నారు.

గొలుగొండలో అధికారులకు సూచనలు చేస్తున్న అయ్యన్న

శివదత్‌కు అభినందన

శివదత్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి : స్థానిక జనసే కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌కు మంగళవారం ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ (రోవర్)గా బోడపాటి శివదత్ నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన నాయకులు ,కార్యకర్తలు కలిసి శివదత్‌కు పుష్పగుచ్చాలు అందజేసి, శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుందాసు అప్పలరాజు, ఆకేటి గోవిందరావు, పాము గణేష్ ఉన్నారు.

నిబంధనలు పాటించని మీసేవా కేంద్రాలు

ప్రజాశక్తి- రావికమతం: మీసేవ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని గ్రామ వార్డు సచివాలయ నర్సీపట్నం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారిని ఎం. ఉదయశ్రీ తెలిపారు. మంగళవారం మండలంలో మేడివాడ మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక బోర్డులు పెట్టలేదని, ఫిర్యాదుల రిజిస్టరు, స్టాక్ రిజిస్టర్లు లేనట్లు గుర్తించామన్నారు .డివిజన్లో 122 మీసేవ కేంద్రాల్లో అధిక కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో ఎంఎన్ఎంఎస్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి రామారావు అభినందనలు తెలిపారు. జాతీయ మెరిట్‌మీన్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని డి యశస్విని, మల్ల చార్మిల, సూరిశెట్టి రశ్మిత తీడ రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించారు వీరిలో ఐదుగురు రాజుపేట గ్రామానికి చెందిన వారు కావడం విశేషం మంగళవారం రాజపేట మండల పరిషత్ పాఠశాల వద్ద హెచ్ఎం ఖలీశా ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల కమిటీ ఛైర్మన్ శ్రీదేవి పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

ఆశా వర్కర్లకు ఎలక్షన్ డ్యూటీ రెమ్యూనరేషన్ చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆశా వర్కర్లకు ఎలక్షన్ డ్యూటీ రెమ్యూనరేషన్ చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, డిఎం అండ్ హెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ఆశా వర్కర్లు మే 13న పూర్తి రోజు ఎలక్షన్ బూత్‌ల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించారన్నారు. దీనికి ఆశా వర్కర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు చేసిన విజ్ఞప్తి ఫలితంగా రూ.200 ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఈ రెమ్యూనరేషన్‌ను గాజువాక, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో చెల్లించినా, మిగిలిన 5 నియోజకవర్గాల్లో ఇంతవరకూ చెల్లించలేదని తెలిపారు. ఎన్నికలు పూర్తయి నెల దాటిపోయినా ఇంకా చెల్లింపులు జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణం చెల్లింపులు జరిగేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.

'అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఐక్యరాజ్య సమితి ఏటా జూన్ 18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతిఘటన దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థలు 'అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఉదయం డాక్టర్ ఎల్‌బి కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో సంస్థ అధ్యక్షులు ఆచార్య వి.బాలమోహన్ దాస్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే ప్రసంగాలకు బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని, ఇది ఎంతమాత్రమూ క్షేమతరం కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ నరవ ప్రకాశరావు ప్రజ్ఞాన్ కుమార్, అబ్దుల్ మునిర్, డాక్టర్ సత్య మూర్తి పాల్గొన్నారు.

బైక్‌లో నాగుపాము హల్‌చల్

బైక్ డిక్కీలోంచి బుసలు కొడుతున్న నాగుపాము

ప్రజాశక్తి - రావికమతం : మండల కేంద్రంలోని హెచ్‌పిసిఎల్ బంక్ సిబ్బంది బైక్‌లో నాగుపాము దూరి హల్‌చల్ చేసింది. బంక్ సిబ్బంది లక్ష్మణరావు ఆదివారం రాత్రి తన బైకును బంకు వద్ద పార్కు చేశారు. సోమవారం ప్రయాణానికి సిద్ధపడగా, బైక్ స్టార్ట్ కాలేదు.దీంతో సీటు విడదీయగా లోపల ఉన్న నాగుపాము పడగ విప్పి బుసలు కొడుతూ, భయ భ్రాంతులకు గురిచేసింది. సిబ్బంది చొరవ తీసుకొని పామును హతమార్చారు.

వైసిపి ముఠా చేతిలో ఎసిఎ దోపిడీ

ప్రజాశక్తి-సీతమ్మధార : రూ.వందల కోట్లు నిధులు ఉన్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) వైసిపి దొంగల ముఠా చేతిలో దోపిడీకి గురైందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఉన్న శరత్ చంద్రారెడ్డి ఎసిఎ అధ్యక్షుడు అయ్యాడని, జైలుకు వెళ్లిన రోహిత్‌రెడ్డి వైస్ ప్రెసిడెంట్, విజయసాయిరెడ్డి బినామీ గోపీనాథ్‌రెడ్డి కార్యదర్శి అయ్యారన్నారు. ఈ ముగ్గురికి ఎక్కడా క్రికెట్ చరిత్ర లేదన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెర వెనుక పథకం ప్రకారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో వీరు ఉండేలా ప్రణాళిక చేశారని ఆరోపించారు. ఆడుదాం ఆంధ్రకు వైసిపి ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయిస్తే, ఎసిఎ బృందం చుట్టుపక్కల వ్యాపారులను బెదిరించి రూ.500 కోట్లు దాకా వసూలు చేసిందని ఆరోపించారు. ఎసిఎ కాస్తా వైసిపి క్రికెట్ అసోసియేషన్‌గా మారిందని,. కడపలో స్టేడియం పేరుతో రూ.కోట్లు పక్క దారి పట్టించారన్నారు. ఈ నెల 30న నిర్వహించే విమెన్ ప్రీమియం లీగ్‌ను నిలుపుదల చేయాలన్నారు. క్రికెట్ సంబంధించి టిక్కెట్లు బ్లాక్‌లో అమ్ముకున్నారని, చివరికి మీడియాకు ఇవ్వాల్సిన పాస్‌లు కూడా అమ్ముకున్నారని తెలిపారు. ఎసిఎలో పరిణామాలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు విచారణ జరిపించాలని కోరారు. ఎసిఎ నిధులతో వైసిపి సిద్ధం సభలకు బస్సులు, వాలంటీర్లను సమకూర్చి, అధికారులకు టిక్కెట్లు సమకూర్చి గోపీనాథ్ రెడ్డి రియల్ ఎస్టేట్ కంపెనీలకు అనుమతులు తెచ్చుకున్నారన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19 నుంచి ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు హైస్కూల్ హెచ్ఎం కవిత, పిడి ఆదిలక్ష్మి, రవీంద్రనాథ్ ఠాగూర్, ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ తెలిపారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ బినయ్ కుమార్ పర్యవేక్షణలో యోగా టీచర్లు దవరసింగి రాంబాబు, సాయి కలిసి విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామంపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈనెల 21న ప్రపంచ యోగ దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఉచిత యోగ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

4న అల్లూరి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయంలో వచ్చే నెల 4న అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. గ్రంథాలయ స్థాపన మూలకారకులు శర్మ మాస్టారు, గ్రంథాలయ ప్రారంభకులు సిఐ సోమశేఖర్ తీర్మానం మేరకు నిర్వహించే అల్లూరి విగ్రహ ప్రతిష్ఠాపనలో మైత్రి గ్రంథాలయ సభ్యులు పాఠకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న శర్మ, సిఐ శేఖర్

వైభవంగా మోదకొండమ్మ జాతర

మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు, టిడిపి ముఖ్యనేతలు

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే మోదమ్మ జాతరను ఈ ఏడాది ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా వేకువజాము నుంచే అధికసంఖ్యలో భక్తులు బారులుదీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు సుమారు లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వివిధ సేవా సంస్థలు మజ్జిగ, మినరల్ వాటర్, ప్రసాద వితరణ చేపట్టారు. విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్‌ను గ్రామమంతా సరఫరా చేశారు. జాతర నేపథ్యంలో మాడుగుల విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయింది.. సాయంత్రం బాణసంచా కాల్చగా, ప్రజలందరూ ఆనందోత్సా హాలతో తిలకించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పుచ్చుకున్నారు. వీరిని ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు శాలువాతో సన్మానించారు అనకాపల్లి జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పివిజి కుమార్, ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మాడుగుల రాణి, తన కుమార్తెతో అమ్మవారి జాతరలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టండి

అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు తాత్కాలిక మరమ్మతులను తక్షణమే చేపట్టాలని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్.రాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, మండల నాయకులు గుములూరు చంద్రమౌళి, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి వెలంకాయలపాలెం జంక్షన్ నుండి రోలుగుంటకు వచ్చే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చోడవరం నుండి నర్సీపట్నం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.95 కోట్లు మంజూరు చేసిందని, అయితే నిర్మాణ పనులు జరగకపోవడంతో అధ్వానంగా ఉన్న రోడ్డులో రాకపోకలకు ద్విచక్ర వాహన దారులు, ఆటోలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణసంకటంగా ఉన్న రోడ్డుకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

మేఘాద్రి గెడ్డ వద్ద పోలీసుల స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-పెందుర్తి : రాష్ట్ర హోంమంత్రి ఆదేశాల మేరకు మేఘాద్రిగెడ్డ ఏరియాలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆ పరిసరాల్లోని యువతీ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ప్రాంతాల్లో డ్రగ్స్, మందు తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ నిఘా ఉంటుందన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

జన్మదిన శుభాకాంక్షలు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
రాపేటి ప్రసాద్
చోడువాడ పంచాయితీ, 5వ వార్డు మెంబర్, చోడువాడ
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
బాలిబోయిన సంతోష్‌యాదవ్
చోడువాడ గ్రామం జనసేన పార్టీ మండల అధ్యక్షులు
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
లెక్కల అచ్చిబాబు ఉపసర్పంచ్,
ఆర్.వై.అగ్రహారం పంచాయితీ, ఉగ్గినవలస గ్రామం
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
చింతలపాటి కళ్యాణ చక్రవర్తి
మాజీ ఎం.పి.టి.సి., అవురువాడ
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
గొల్లవిల్లి రాజేష్ బిజెపినాయకులు,
మాజీ పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు, ఎం.కోడూరు
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
బోజంకి సూర్యనారాయణ టి.ఎన్.టి.యు.సి. అధ్యక్షులు,
వి.మాడుగుల నియోజకవర్గం ఆనందపురం గ్రామం,
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
పెంటకోట గణేష్
టిడిపి బూత్ ఇన్‌చార్జీ, చౌడువాడ
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

అనునిత్యం ప్రజాసేవలో మమేకమైన
మా ప్రియతమ నాయకులు
మాడుగుల నియోజకవర్గ
శాసనసభ్యులు
గౌ॥ శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
కాటిపాము
అర్జునరావు
తెనుగుపూడి గ్రామశాఖ అధ్యక్షులు
దేవరాపల్లి మండలం
దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
శిలపశెట్టి ముసిలినాయుడు
మాజీ పాలకేంద్రం డైరెక్టర్, టిడిపి నాయకులు, చౌడువాడ
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
భీశెట్టి రామకోటి చంద్రిక వెల్డింగ్ షాపు
టిడిపి నాయకులు, చౌడువాడ
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

జన్మదిన శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు,
శ్రేయోభిలాషులు
మా ప్రియతమ నాయకులు
మాడుగుల శాసనసభ్యులు
శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
జన్మదిన శుభాకాంక్షలు
దంగేటి సూర్యారావు
బిజెపి నాయకులు, మాజీ సర్పంచ్
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

అనునిత్యం ప్రజాసేవలో మమేకమైన
మా ప్రియతమ నాయకులు
మాడుగుల నియోజకవర్గ
శాసనసభ్యులు
గౌ॥ శ్రీ బండారు
సత్యనారాయణమూర్తి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
దాడి ఎరుకునాయుడు
సర్పంచ్,
చౌడువాడ గ్రామపంచాయితీ
ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ
ఛాంబర్ అధ్యక్షులు
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.